# ధాన్యం దళారుల పాలు



మండలంలోని ఓ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న దళారులు

- పెగడపల్లి మండలంలో నామ మాత్రంగా కొనుగోలు కేంద్రాలు
- మూడు కేంద్రాల్లో ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు
- నష్టపోతున్న అన్నదాతలు

పెగడపల్లి, నవంబర్ 24: పెగడపల్లి మండలంలో అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం దళారుల పాలవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నామ మాత్రంగా కొనుగోళ్లు చేపడుతుండడంతో దళారుల పంట పండుతున్నది. దళారులు కొనుగోలు కేంద్రాల్లోకి వచ్చి దర్జాగా ధాన్యాన్ని తూకం వేసి తీసుకెళ్తున్నారు. మండలంలో వానకాలంలో సుమారు 21 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, సుమారు 4.5 లక్షల క్వింటాళ్లపై చిలుకు ధాన్యం పండినట్లు మండల వ్యవసాయాధికారులు అంచనా వేశారు. మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో 27 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఆదివారం వరకు 1.30 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. వరి కోతలు పూర్తి కావస్తుండడంతో అన్ని కేంద్రాల్లో కలిపి మరో 30 వేల క్వింటాళ్ల వరకు మాత్రమే ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. 3 లక్షల క్వింటాళ్లకు పైగా దళారులే కొనుగోలు చేయడం పట్ల విమర్శలు వస్తున్నాయి. మండలంలోని ఏడుమోటలపల్లి, రాములపల్లి, నంచర్ల కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో, ఇక్కడ దళారులే రాజ్యమేలుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో వసతులు లేకపోవడం, అనేక నిబంధనలు, మిల్లర్లతో ఇబ్బందులు వస్తుండడంతో పాటు కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో రైతులు తమ ధాన్యాన్ని క్వింటాలుకు రూ.1750 నుంచి రూ.2100 చొప్పున దళారులకే అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం సన్న రకాలకు బోనస్‌తో కలిపి క్వింటాలుకు రూ.2800 చెల్లిస్తున్నప్పటికీ, వీటికి బయట మార్కెట్లో రూ.2600 నుంచి రూ.3000 వరకు వస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా నేరుగా దళారులకే విక్రయిస్తున్నారు. మండలంలోని 27 కేంద్రాల్లో గత వానకాలంలో 3 లక్షలకు పైగా క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి అందులో సగం కూడా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కోరుట్ల: పద్మశాలీ సంఘ భవనంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు





గొల్లపల్లి: మల్లన్నపేటలో గ్రామస్తుడిని పరీక్షిస్తున్న వైద్యుడు శ్రీనివాస్‌రెడ్డి

## వైద్య శిబిరాలకు స్పందన

కోరుట్ల, నవంబర్ 24: పట్టణంలోని భీమునిదుబ్బ సాయి జీనియస్ హైస్కూల్‌లో కౌన్సిలర్ ఆడెపు కమలమధు ఆధ్వర్యంలో మెడికవర్ దవాఖాన (కరీంనగర్) సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్యులు సుమారు 300 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఇక్కడ వైద్యుడు హర్షిత్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని పద్మశాలీ సంఘ భవనంలో పద్మశాలీ యువత ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ దవాఖాన సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ ప్రారంభించారు. వైద్యులు మిట్టపల్లి రాజేశ్, సంతోష్‌కుమార్, మధుశ్రీ సుమారు 500 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, ప్రసాద్, ప్రవీణ్, గణేశ్ పాల్గొన్నారు.

గొల్లపల్లి, నవంబర్ 24: మల్లన్నపేట గ్రామంలో ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 277 మంది గ్రామస్తులకు వివిధ పరీక్షలు చేసి, అవసరమున్న వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, వైద్యులు మృదుల, రాజశేఖర్, సుధీర్, ప్రశాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, నాయకులు సిద్దంకి మల్లా రెడ్డి, రాజన్న, సత్తన్న, అవారి చందు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనం

జగిత్యాల టౌన్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని పుల్లూరి నారాయణదాస్ ఆశ్రమంలో 'మనమంతా శ్రీనివాసులం' గ్రూప్‌లో ఉన్న జగిత్యాల జిల్లాలోని శ్రీనివాసులందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనానికి సుమారు 120 మంది శ్రీనివాసులు హాజరు కాగా, పరిచయ కార్యక్రమం నిర్వహించి తదుపరి కార్యాచరణ ఏర్పాటు చేశారు. జనవరి మొదటి వారంలో నిర్వహించే శ్రీనివాసుల మహాసభను విజయవంతం చేసి, తలసేమియా బాధితులకు రక్తదానం చేయాలని సంకల్పించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో టీఎస్ఎస్ఎస్ చైర్మన్ వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యులు దూస శ్రీనివాస్, విజ్జగిరి శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన శ్రీనివాసులు

నమస్తే తెలంగాణ CLASSIFIED

BUSINESS OFFER



★సిబిల్ స్కోర్ పెంచబడును ఇంటి పై లోన్ / ఓపెన్ ప్లాట్ లోన్ / బిజినెస్ లోన్/పర్సనల్ లోన్ సంప్రదించండి: పెద్దపల్లి సెల్: 9346756075

NTK-325450

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

## ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

రాయికల్, నవంబర్ 24: రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇన్విటేషన్ ఓపెన్ టూ ఆల్ సీనియర్ వాలీబాల్ టోర్నమెంట్ ముగిసింది. పోటీలను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రారంభించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగారెడ్డి, రమేశ్, టోర్నమెంట్ నిర్వాహకులు తిరుపతి రెడ్డి, ప్రవీణ్, ముఖిద్, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం



ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం సభ్యులు

మల్యాల, నవంబర్ 24: మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా కొండ జనార్దన్, అధ్యక్షుడిగా పెంట సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నక్క మధుకర్, కోశాధికారిగా ఇజ్జగిరి గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఐల్నేని రాజేశ్వర్‌రెడ్డి, కంది చంద్రశేఖర్, కుసుమ శంకర్, సందుపట్ల రాజేశం, విశ్వనాథం, భూపతి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

మల్యాల, నవంబర్ 24: మండలంలోని తాటిపల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. కాగా, విద్యార్థులు మనుశ్మిత, మనీషా, రేవతి, సంజన, జస్మిక, సంజనను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

## ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబర్ 24: ధర్మపురి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. గోదావరి నదిలో కార్తీక దీపాలను వదిలారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలను వెలిగించి, బ్రాహ్మణులకు దీపదానాలు చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

## ఆకట్టుకున్న ప్రహ్లాద పురాణ ప్రవచనం

ధర్మపురి, నవంబర్ 24: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ప్రాంగణంలోని శేషప్ప కళావేదికపై ఆదివారం నిర్వహించిన ప్రహ్లాద పురాణ ప్రవచనం భక్తులను ఆకట్టుకున్నది. కార్తీక మాసం పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మానకొండూర్‌కు చెందిన గర్రెపెల్లి శకుంతల ప్రహ్లాద చరిత్ర పురాణ ప్రవచం చేశారు. అనంతరం శకుంతలను ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, శారద మహిళా మండలి సభ్యులు సన్మానించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న యాదవులు

కోరుట్ల రూరల్, నవంబర్ 24: పైడిమడుగు గ్రామానికి చెందిన ఆశన్న ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యులకు ఆదివారం టీవీఎస్వీ జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గనవేని మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ కులస్తులు రూ. 85,216 అందజేశారు. ఇక్కడ యాదవ సంఘం నాయకులు రవి, శేఖర్, చిన్నయ్య, మల్లన్న, శంకర్, వినోద్ ఉన్నారు.

## సహారా ఇండియా బాధితులను ఆదుకోవాలి





నిరసన తెలుపుతున్న సహారా ఇండియా బాధితులు

కోరుట్ల, నవంబర్ 24: సహారా ఇండియా సంస్థ ఖాతాదారులకు బకాయి డబ్బులు చెల్లించి ఆదుకోవాలని సహారా ఇండియా బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పూజిత కోరారు. పట్టణంలోని సాయిరామ ఆలయ ఆవరణలో ఆదివారం సహారా బాధితులు నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారుల డబ్బులు రూ. 80 లక్షల కోట్లు చెల్లించకుండా సహారా ఇండియా సంస్థ పేదల జీవితాలతో చెలగాటమాడుతున్నదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సహారా ఇండియా ఖాతాదారులకు నయా పైసాతో చెల్లిస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ, అమిత్ షా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట మరిచారన్నారు. భవిష్యత్‌లో అవసరాలకు పనికొస్తాయని కొండంత ఆశతో ఖాతాదారులు సహారాను నమ్మి డబ్బులు పొదుపు చేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం బాధితులు సహర ఇండియా సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు బాలయ్య, రాజేశ్వరి, గణేశ్, నరేశ్, రామస్వామి, నారాయణ, శ్రీనివాస్, రాజ్ కుమార్, పురుషోత్తం, గంగాధర్, ప్రభాకర్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల రూరల్: కార్తీక వనభోజనాలకు హాజరైన గణేశ్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

## కార్తీక వన భోజనాలు

జగిత్యాల/జగిత్యాల రూరల్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని గుట్ట రాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం కార్తీక వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కనక దుర్గా సేవా సమితి ట్రస్టు సభ్యులు గుగిల్ల నాగభూషణం, రాము, ప్రసాద్, చెట్‌పల్లి సుధాకర్, భక్తులు పాల్గొన్నారు. అలాగే, పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు శ్రీ గణేశ్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొలాసలోని పౌలస్తీశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకాలు, మహిళల దీప దానాలు, గోపూజ నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు ఆలయంలో కార్తీక వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రవికిషన్, అర్చకులు గోవర్ధన శర్మ, గోపాల శర్మ, మహేశ్ శర్మ, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో..

మల్లాపూర్, నవంబర్ 24: వాల్గొండలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కార్తీక వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జక్కుల నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్: కార్తీక వన భోజనాలకు హాజరైన పీఆర్టీయూ నాయకులు

## డాక్టరేట్ ప్రదానం

జగిత్యాల రూరల్, నవంబర్ 24: జగిత్యాల మండలం మోతే గ్రామానికి చెందిన దాసరి రఘు రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు గానూ శాతవాహన విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రంగప్రసాద్ డాక్టరేట్ ప్రకటించారు. 'డిజైన్, సిథసిస్, కారెక్టరైజ్‌షన్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్' అంశంపై రసాయన శాస్త్ర విభాగం ఆచార్యుడు నమ్రత పర్యవేక్షణలో రఘు పరిశోదన పూర్తి చేశారు.



రఘు

## ఎమ్మెల్సీగా ఆదరించండి

జగిత్యాల, నవంబర్ 24: నిరుద్యోగ పట్టభద్రుల అభ్యున్నతి కోసం తాను ఉద్యోగం వదిలి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, తనను ఆదరించి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్స్‌లో ఆదివారం ఆయన పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్న పట్టభద్రులకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు మంజూరు, ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ సాధించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు, రాజేందర్, రమణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 24: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన మహ్మద్ జాకిర్‌ఖాన్ వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం వెల్డింగ్ దుకాణాల యజమానులు జగ్గసాగర్ కొండస్వామి ఆలయ ప్రాంగణంలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. సమ్మేళనానికి హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జాకిర్ ఖాన్ వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయ సమీపంలో అదుపు తప్పి పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స కోసం నిజామాబాద్ దవాఖానకు తరలించారు.

## పూర్తయిన ధాన్యం కొనుగోళ్లు

మల్యాల, నవంబర్ 24: మండలంలోని కొండగట్టు దిగువన మల్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు సెంటర్ నిర్వాహకుడు, సహకార సంఘం డైరెక్టర్ సంత ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 8000 క్వింటాళ్లు కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు.

## నేడు మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మెట్‌పల్లి, నవంబర్ 24: మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

## సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

జగిత్యాల, నవంబర్ 24: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్బీహెచ్ అధికారులు నలువాల గంగాధర్ సూచించారు. జగిత్యాలలోని మినీ స్టేడియంలో ఆదివారం ఎస్బీహెచ్ ఆధ్వర్యంలో కరపత్రాలతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై అవగాహనతోనే నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. బ్యాంక్ ఉద్యోగులు కృష్ణ, సంతోష్, వాకర్స్ పాల్గొన్నారు.

## మాలలు ఐక్యంగా పోరాడాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 24: మాలలు ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ పేర్కొన్నారు. మెట్‌పల్లి మండలం వేంపేటలోని సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన మాలల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాలలకు రాజ్యాంగ ఫలాలను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. సమాజంలో మాలలు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలల హక్కులు, ఆత్మగౌరవం కోసం డిసెంబర్ ఒకటిన హైదరాబాద్‌లో నిర్వహించే 'మాలల సింహ గర్జన సభ'కు మాల కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మాల సంఘం సభ్యులతో కలిసి సింహ గర్జనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్టు దాస్, మాల మహానాడు నాయకులు లక్ష్మీనారాయణ, సంటి సురేశ్, నరేశ్, తలారి నర్సయ్య, కారెంగుల మారుతి, జలేందర్ పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలు చేపట్టాలి

గొల్లపల్లి, నవంబర్ 24: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని క్లబ్ రీజియన్ చైర్మన్ లయన్ తన్నీరు రాజేందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో క్లబ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో క్లబ్ సభ్యులు మోర భద్రేశం, చంద్రమోహన్ గౌడ్, చాప కిశోర్, డాక్టర్ శ్రీనివాస్, గుర్రం బాపు రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, మునీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం



జగిత్యాలరూరల్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాల రూరల్, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగరాజం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, అధికార ప్రతినిధి బెజ్జెంకి సతీశ్, నాయకులు బాలే శంకర్, దుమాల రాజ్‌కుమార్, బోనగిరి కిషన్, నక్క రమేశ్, కొల్లూరి సురేందర్, బొల్లారపు దివాకర్, బాపురపు గంగారం, సంగెపు ముత్తు, ఎనగందుల మోహన్, నక్క హరీశ్, మల్యాల జీవన్, బాలే నర్సయ్య, నలువాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, నవంబర్ 24: జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ నాయకులు రాజిరెడ్డి, నర్సయ్య, శోభన్, మురళి, కృష్ణప్రసాద్, సత్తయ్య, తదితరులున్నారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్ష

జగిత్యాల టౌన్, నవంబర్ 24: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఎన్ఎంఎంఎస్ పరీక్ష నిర్వహించినట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1508 మంది విద్యార్థులకు గానూ 1470 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో 97.48 శాతం విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

మల్లాపూర్, నవంబర్ 24: మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన మేర మహేశ్ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు మెట్‌పల్లి ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్టు, మెట్‌పల్లి డివిజన్ టాటా మ్యాజిక్ జేఏసీ యూనియన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు సురిగి శ్రీనివాస్‌గౌడ్, గుగ్లావత్ శివలాల్‌నాయక్, వీడీసీ అధ్యక్షుడు మహబూబ్‌ఖాన్, సభ్యులు రాజేశ్, సన్ని, మణిదీప్, ప్రశాంత్, సంపత్‌గౌడ్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలు

జగిత్యాల, నవంబర్ 24: జగిత్యాలలోని వివేకానంద స్టేడియంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ బీఎస్ లత హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి సాయిబాబా, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, హౌసింగ్ డీఈ రాజేశ్వర్, సహాయ సంక్షేమాధికారి సునీత, కార్యాలయ సూపరింటెండెంట్ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత